

కథ 1991

4

# బిడ్డలుగల్ల తల్లి


ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు


మా కనకత్తని తిట్టి తూర్పార బట్టనివాళ్లు ఊళ్లో ఒక్కరు కూడా లేరు. నలుగురి నోళ్లల్లో నానా రకాలుగా నానుతూ ఉంది.

"కడుపులో బెట్టుకోవాల్సిన తల్లి గూడా పోయే నా సవితీ! అంటే ఇంక ఆ బిడ్డేం గావాల? యాడ జావాల?" అనింది మా అమ్మ.

"తప్పేజేసింది బో, అదేం అన్నాయం? కట్టు కున్న మొగుడూ గొట్టె. అక్క మొగుడూ గొట్టె, ఇంటికి సుట్టపు సూపుగా వొచ్చిన్నాబట్టా గొట్టె. కడాకి కన్నతల్లి గూడా గొడితే ఎట్టా?" అని ప్రశ్నించింది మా పెద్దమ్మ.

"అదేం గోరం అబయా! కాల్తో చేత్తో... కాల్తో చేత్తో... కాల్తో చేత్తో వొకటే యావన సంపాదిలిపెట్టిందే. దాని కాళ్లల్లో పుండుబుట్ట, దాని చేతులిరగ! కడుపు గ్గన్న కూతురేనాని అది!" పద్మమ్మ తిట్ల పురాణం ప్రారంభించింది.

"మిగతా నా సవితులంతా పెతీవతలైనట్టు అందరూ దాన్ని ఆడిపోసుకొనేవాళ్లే! మొకాన ఇంత బొట్టుతో లచ్చిందేవి మాదిరుండే బిడ్డ జూడు, పీనిగి మాదిరి అయిపోయుండాది," దుఃఖంతో చెప్పింది నీలమ్మ.

"నేనొక మాటంటా! కాపరమన్నాక గుట్టూ మట్టూ ఉండాల. మొగుడన్నోడు నాలుగు దెబ్బలేసి కాపరం జేసుకోవాల్నా, ఈదిలో కీడ్చి ఆగిత్తెమంతా జేయాల్నా? ఏందంట ఇది?" మందలింపుగా అనింది మనోరంజనమ్మ.

మా మిద్దింటత్త ఇంటి ముందు పందిట్లో వెల్లికిలా వేసిన మంచం మీద కూర్చున్నాను నేను. మా బంధు బృందం అంతా తలో గుంజనీ ఆనుకుని కూర్చున్నారు.

పందిటి పక్కన సీమచింత చెట్టు మీద కాకుల గుంపు గోల చేస్తూ ఉంది. ఈకలు చెదిరిన కాకి ఒకటి గుంపులోంచి ఎగిరొచ్చి కరెంటు తీగమీద వాలింది. అప్పటికే దాని రెక్కల మీద ఈకలు కొన్ని ఊడిపో యాయి. ఆ ఒంటరి కుంటికాకిని గుంపంతా వెంటాడు తోంది. ఈ గొడవకి బెదిరిన పిచుకలు కొన్ని జీలగచెట్టు మీద చేరి కిచకిచలాడుతున్నాయి.

"చీ యెదవ కాకులు! చెయ్! చెయ్! పొండి! ఆ ట్టేడన్న బోయి సావండి!" నీలమ్మ కాకుల్ని తరిమి తిరిగివచ్చి కూచుంటూ అనింది.

"అబయా! నువ్వేమన్నా జెప్పు. అది బిడ్డల్ని సాకి సంతరించిన అమ్మగాదు. అదసలు ఆడదేగాదు. దెయ్యపుముండ!"

వీళ్లందరి ఆగ్రహం, అసహ్యం నాకు అర్థమ య్యాయి. మా కనకత్తది వట్టి పల్లెటూరి అమాయ కత్వం. వెర్రిబాగుల మనస్తత్వం. రాజమ్మ లేచిపోయిన దగ్గర నుంచి ఆమెను నేను గమనిస్తూనే ఉన్నాను.

రాజమ్మ మా కనకత్త కూతురు. మా కనకత్తకి ఇద్దరు కూతుళ్లు. పెద్దబిడ్డని అయిన ఇంట్లోనే ఇచ్చింది. రాజమ్మని మేనల్లుడికి ఇచ్చారు. మా వెంకటముని మామ బలవంతం మీద రాజమ్మ పెళ్లి జరిగింది. మా కనకత్తకి ఈ సంబంధం ఇష్టంలేదు. అయితే నలుగురూ నటరాజన్ ప్రయోజకత్వాన్ని మెచ్చుకోవడంతో మా కనకత్తకి ఒప్పుకోక తప్పలేదు.

నటరాజన్ ఊరమ్మిడ కాటన్ మిల్లులో పనిచేసే వాడు. ఒకసారి మిల్లులో సమ్మె జరిగింది. నటరాజన్‌తో సహా సగంమందిని పనిలోంచి తీసేశారు. దీంతో పూట గడవటం కష్టమయింది. నటరాజన్ నాయనకేమో ఇంటి కష్టం, సుఖం పట్టవు. ఆయనది అరవ దేశం.

మద్రాసులో ఏదో పనిచేసేవాడు. మూడు నెలలకో, నాలుగు నెలలకో ఒకసారి వచ్చేవాడు. వచ్చినప్పుడు చేతిలో ఉంటే నాలుగు రూపాయలు పెట్టి పోయే వాడు. ఇంట్లో పెళ్లి కెదిగిన ఆడబిడ్డలు ఇద్దరున్నారు.

ఈ కష్టకాలంలో మేనమామ నటరాజన్‌ని ఆదుకున్నాడు. కోనేటిగట్టున బంకు పెట్టించాడు. నటరాజన్ చురుకైనవాడు. చొరవ గలవాడు, మాటకారి. అందరినీ వరసలు కలేసుకుని మాట్లాడే తత్వం. వ్యాపారం బాగా జరిగింది. బంకులోనే వడ్డీ వ్యాపారం కూడా ప్రారంభించాడు. దీంతో రెండేళ్లకే ఇంటి మీద నాటు పెంకు దింపిచ్చి, సీమ పెంకు ఎక్కిచ్చాడు. ఒక చెల్లెలి పెళ్లి చేశాడు. తమ్ముడిని కాలేజీలో చేర్పించాడు. ఇంత వ్యాపారం ఒక్కడే చూసుకోలేక సతమతమయ్యేవాడు. ఈ సమయంలోనే రాజమ్మతో పెళ్లి జరిగింది. రాజమ్మ తోడుతో వ్యాపారం మరింత పెరిగింది. రాజమ్మ ఇటు ఇంట్లో అత్తకి చేదోడు వాదోడుగా ఉంటూనే, బంకులో నటరాజన్‌కి సాయం చేసేది. నటరాజన్ తండలి వసూళ్లకి తిరుగుతూ ఉంటే, రాజమ్మ బంకు చూసుకునేది. వాళ్ల కష్టం, వాళ్ల సుఖం గురించి ఊళ్లో అందరూ మెచ్చుకోలుగా చెప్పుకునేవారు.

ఇద్దరు బిడ్డలు కలిగారు. పచ్చని సంసారం. అంతా నిమ్మళంగా ఉందనుకొంటున్న సమయంలోనే రాజమ్మ లేచిపోయింది.

'ఏదీ? ఏద'ని వెతుక్కునేప్పటికే వెంకునాయుడి ఇల్లు చేరింది.

అంతా వెంకునాయుడి ఇంటిమీద పడ్డారు.

రాజమ్మ రానని తెగేసి చెప్పింది. నలుగురూ నాలుగు మంచి మాటలు చెప్పారు. ఒప్పించి వెనక్కు తీసుకువచ్చారు. అదేం ప్రేమో, అదేం మోహమో! మూడోనాటికే మళ్లీ వెంకునాయుడి ఇల్లు చేరింది.

మావాళ్లంతా కోపంతో రగిలిపోయారు. వెంకునాయుడు ఊరొదిలి పారిపోయాడు. వెంకునాయుడు సొసైటీలో గుమాస్తా. తూర్పు నుంచి వచ్చాడు. పెళ్లైంది. పిల్లలున్నారు.

ఊళ్లో వెంకునాయుడు బలే హీరో! నాలుగు బర్రెలు పెట్టి పాలు, మజ్జిగ అమ్మాడు. చిన్నాచితకా వ్యాపారాలు చేశాడు. నాలుగేళ్లకే ఊళ్లోమిద్దె కట్టాడు. వెంకునాయుడిది కష్టం చేసిన ఒళ్లు. ఒడ్డూ, పొడుగూ మనిషి. విసుగు పుట్టి కిరీటం తీసి పక్కన పెట్టిన మహారాజులా ఠీవిగా ఉంటాడు.

"అట్టాంటి మొగోడ్ని చూస్తే ఏ ఆడదానికైనా మనసు పుట్టకుండా ఉండునా ఏమి?" అంటుంది మనోరంజనమ్మ.

అయితే పదిమందిని అలాగ్గా ఎడంచేత్తో సమాళిచ్చేస్తాడనుకున్న అటువంటి మొగోడు, మా వాళ్లంతా నిప్పుకణికల్లా ఇంటిమీద పడేటప్పటికి పెళ్లాం బిడ్డల్ని కూడా వదిలి పారిపోయాడు.

రాజమ్మని అక్కడి నుంచి ఈడ్చుకొచ్చారు. ఒక దెబ్బకాదు, ఒక తిట్టుకాదు- ఒక్క మనిషి కాదు- అందర్లోకీ ఆగిత్యం అంతా మా కనకత్తదే!.

మూల తిరుగుట్లో వేపచెట్టు కింద రాజమ్మ చతికిలపడింది. అక్కడనుంచి ఇక కదలనంటుంది.

"కూటికి తక్కువా, గుడ్డకి తక్కువా? నీకేం తక్కువ జేశానే?" అంటూ నటరాజన్ బిగించిన పిడికిలితో గుద్దాడు. రాజమ్మ లుంగచుట్టుకుని పడింది. కాలితో డొక్కలో పొడిచాడు. వెల్లికిలా పడింది. జుట్టు పట్టుకుని లేవదీసి వీపు మీద పిడిగుద్దులు గుద్దాడు.

రాజమ్మ అక్క మొగుడు అందుకున్నాడు. "మెడకాయ మీద తలకాయ బెట్టుకోని నలుగుర్లో ఎట్టే ఇప్పుడు తిరిగేది?" అని కాలితో నాలుగు పోట్లు పొడిచాడు. చెళ్లున చెంప చరిచాడు.

చుట్టపుచూపుగా వచ్చిన నాగయ్య కూడా నాలుగు దెబ్బలేశాడు.

నటరాజన్ మళ్లీ ముందుకు వచ్చాడు. జుట్టు పట్టుకుని పైకి లేపి ముక్కుమీద పిడికిలితో గుద్దాడు. రాజమ్మ వెనక్కి విరుచుకుపడింది. కాల్తో డొక్కలో పొడిచాడు. రాజమ్మ ఒక్క మూలుగు మూలిగి ఉండ చుట్టుకుని పడింది. నటరాజన్ మరోసారి కాలు పైకి లేపాడు. వేపచెట్టు మొదట్లో ఉన్న మా కనకత్త ముందుకు ఒక్క దూకు దూకింది.

"అబయా! నువ్వుండట్టి!" అని నటరాజన్‌ని పక్కకి నెట్టేసి తనే రెండు దెబ్బలేసింది.

"ఇప్పుడు నీకిదేం బుద్ధి బుట్టిందే ముండా! నీ మొకానికి మిండగాడు గావాల్సొచ్చినాడంటే యెదవా? రతనాల మాదిరి బిడ్డలు కలిగినారు, మకారాణి మాదిరిగా జూసుకొనే మొగుడుండాడు. ఇదేం పనే"? అంటూ రాజమ్మ జుట్టు పట్టుకుని ఈ చెంపా, ఆ చెంపా వాయించి వదిలింది.

"ఈ ముదనష్టపు బతుక్కన్న యే కొనేట్లోనో, బాయిలోనో దూకి సావగూడదంటే?" అని మరో రెండు దెబ్బలేసింది.

రాజమ్మ ఒక్క మాట మాటాడదు. ఒక్క ఏడుపు ఏడవదు. దెబ్బల బాధకి మెలితిరిగిపోతున్నా కన్నీళ్లు మాత్రం జారనివ్వదు.

"దీన్తో కాపరం నా వల్లగాదు. యాడన్నా, జావనీ! రంగడ్ని పిలవనంపండి! ఏదో వొహటి వొగదెంచాల," అని నటరాజన్ నాలుగడుగుల అవతల కెళ్లి నిలుచున్నాడు. మిగిలినవాళ్లు ఒక్కొక్కరే అక్కడ నుంచి తప్పుకుంటున్నారు.

రాజమ్మ మాత్రం చిందరవందరైన జుట్టుతో, చిరిగి పేలికలైన చీరతో, ఒంటేపచెట్టు కింద గులకరాళ్ల గుట్ట మీద కుప్పగా పడి ఉంది.

కాసేపటికి లేచి నిలుచుంది. జుట్టు కూడా సర్దుకోలేదు. ఎదమీద సక్రమంగా లేని పైటని పట్టించుకోలేదు. భారంగా పుట్టింటివైపు నడిచింది.

మా కనకత్త రాజమ్మకన్నా ముందు గునగునా నడిచి పొయ్యి గడపలో అడ్డుగా నిలుచుంది.

"నిలువక్కడ! యాడికొస్తాండావు? ఇదేమన్నా నీ మిండగాడి కొంపనుకొన్నావంటే? నడువ్ బైటకి! ఇంగొక్క అడుగేసినావంటే కాళ్లించి పోయిలో బెడ్తా ముండా! యాడన్నా బోయిసావు! నా మొత్త మాతరం తొక్కబాక! పో యెదవా!" అని ఇళ్ల లోపల ఉండే వాళ్లంతా వినేంత పెద్దగా అరిచింది.

వేప చెట్టుకింద నటరాజన్ కదలడం చూసి, "నట్రాజా! వుండక్కడ! యాడికి కదుల్తుండావు. మీ మొగుడు పెళ్లాల యవ్వారం యిది. సంపుకుంటావో, సంతరించుకుంటావో నాకు మాతరం ఈ పీడొద్దో!" అని రాజమ్మని జుట్టు పట్టుకుని బరబరా ఈడ్చుకు వెళ్లి నటరాజన్ ముందు పడేసింది.

రాజమ్మ చివుక్కున లేచి, గిరుక్కున అత్తింటివైపు నడిచింది.

మూడోనాడు రాజమ్మ తమ్ముడు రంగారావు వచ్చాడు. రంగారావు విజయవాడలో పనిచేస్తున్నాడు. ఇంటి గురించి ఎప్పుడూ పట్టించుకున్నవాడు కాదు. వాళ్ల నాయన చనిపోయినప్పుడు టెలిగ్రాం ఇస్తే, వచ్చి, రెండోరోజే వెళ్లిపోయాడు. తిరిగి దినం రోజే రావడం. కలిగినింటి బిడ్డని చేసుకున్నాడు.

ఊరి నుంచి వచ్చిన గంటకి రంగారావు నటరాజన్ ఇంట్లో అడుగుపెట్టాడు.

రాజమ్మ తిండీ తిప్పలు లేక ఒక మూల మురికి గుడ్డల మూటలా పడి ఉంది.

రావడం రావడం కాలితో ఒక్క పోటు పొడిచాడు. "యెదవ పుట్టక బుట్నావుగదే ముండా! అయినోళ్ల దెగ్గిర పరవు మర్రెద ఏమన్నా మిగుల్నా ఇప్పుడు? గుట్టు సప్పుడు గాక ముందే యాడన్నా దూకి సచ్చుండ గూడదంటే, మా మొకాన దాపరించకపోతే?" అని ఎడా పెడా బాదాడు.

"వుయ్‌రా! దాని మొకాన వుయ్‌రా! యెదవ ముండ ఎట్టా జచ్చిందో జూడు," అంటూ మా కనకత్త రంగారావు చేతుల్లోంచి రాజమ్మని విడిపించింది.

"మాయరోగమొచ్చి దీన్నెత్తకపోను! నలుగురూ దీని మొకాన వుయ్యండమ్మా!" వియ్యపురాలు.

"నట్రాజా! నాయినా, ఇది నీ కాపరం ఈదిన బెట్టిందే, ఇదా ఇంక బాగుపడ్తాది? బంగారంటి బిడ్డల్నీ, నిన్నూ జూస్తా ఉంటే నాకు దుక్కం కలగతా ఉండాదే! ఎట్టాంటి బిడ్డవి ఎట్టైపోయినావు నాయినా! ఈ ముండ జేసిన పనికి మూడునాళ్లుగా కూడూ, నీళ్లూ లేక పడుండావే! నా నాయినా! నా రాజా! నా కన్నా!" అంటూ మా కనకత్త నటరాజన్‌ని పట్టుకుని ఏడ్చింది.

నటరాజన్ కూడా బోరున ఏడ్చేశాడు.

"యాడైనా జావండి! ఏమైనా జేసుకోండి! ఇది నా తోడబుట్టిందేగాదు. ఈ కంపని మాతరం నాకు తగిలించబాకండిరా సామీ!" అనేసి రంగారావు వెళ్లిపోయాడు.

అక్కడ ఎవ్వరూ రంగారావును పట్టించుకోలేదు. ఒకరిని పట్టుకుని ఒకరు ఏడుపుల్లో మునిగిపోయి వున్నారు. ఒక్క రాజమ్మ మాత్రమే నిశ్చలంగా ఒక మూల పడి ఉంది.

అన్నదమ్ముడు సరే, పెళ్లానికి జడిసి చేతులెత్తేశాడు. తొమ్మిది నెల్లు మోసి కన్నతల్లి కూడా కనికరం లేకుండా ప్రవర్తించడమా? పక్కన శవంలా బిడ్డ పడుంటే పట్టించుకోక, అల్లుడిని పట్టుకుని ఏడవటం ఎవరికి మాత్రం నచ్చుతుంది?

ఆ సాయంత్రం మా కనకత్తని అదే అడిగాను. "అబయా! ఈ దినం నలుగురమ్మలూ నా నోట్లో ఊస్తూండారని తెలుసు. నా బిడ్డ కోసరం నాలుగు మాటలు పడితే మాతరం యేంబొయ్యేది? దానికి పుట్టింట్లో ఇంత చోటుండాదని తెలిస్తే నాబట్ట ఇంక దాన్తో కాపరం జేసునా ఏమి? దేన్నో ఒకదాన్ని కట్టుకోని నా బిడ్డకి అన్నాయం జెయిడా? అప్పుడింక ఊళ్లో కోణంగి నా కొడుకులంతా నా బిడ్డని కాకుల మాదిరిగా పొడిసి పొడిసి సంపరా? పుట్టింట్లో గూడా దానికి గెతి లేదంటే పక్కలో గాకపోయినా పాదాల దెగ్గిరైనా దాన్ని

పండుండనీడా? నా బిడ్డ కోసరమేరా నాయినా నేను గుండె రాయి జేసుకునింది,'' అని బోరున ఏడ్చేసింది మా కనకత్త.

మా కనకత్త ప్రవర్తన తొలిలో నలుగురితోపాటు నన్నూ కొంచెం కలవరపరచిన మాట నిజమే! ఇప్పుడా నీడలు తొలిగాయి. అందరూ అనుకుంటున్నట్టు మా కనకత్త కఠినాత్మురాలు కాదు. ఆమె తాపత్రయం అంతా బిడ్డ బతుకు కోసమే. 'మొగుడొదిలేసింది,' అని ముద్ర పడితే బిడ్డ బతుకు ఏమవుతుందో అని బెంగ పెట్టు కుంది. భవిష్యత్తును ఊహించి భయపడింది. కూతురి కాపురం కోసం 'కసాయి తల్లి'గా నటించింది. నలుగు రినీ నమ్మిస్తున్నానని అనుకున్నది.

కానీ, మా కనకత్త నమ్మినట్టు రాజమ్మ కాపురం బాగుపడలేదు. ఆరునెలలు గడిచినా నటరాజన్‌లో మార్పులేదు. పక్క మీదకి కాదు గదా, పాదాల దగ్గరికి కూడా చేరనివ్వలేదు. అత్తింట్లో రాజమ్మ తిన్నదా, తాగిందా అని పట్టించుకునేవాళ్లు లేరు. నలుగురిలో కలవడానికి ప్రయత్నిస్తే ఈసడించుకునే వాళ్లు- తల్లో దువ్వెన పెడితే ఒకమాట, మొహం కడిగితే ఒక మాట. వీధి వాకిలి వేపు నడిస్తే అందరికీ అనుమానమే. ఇంట్లో పనేదైనా ముట్టుకోబోతే విసిరికొట్టేవాళ్లు. ఈ అవమానం అనంతంగా సాగుతూనే ఉంది.

అప్పుడిక మా కనకత్త మళ్లీ రంగంలోకి దిగింది-
''నటరాజా! తప్పో, ఒప్పో జరిగిపోయిందేదో జరిగిపో యింది. ఆ బిడ్డ మళ్లీ వాడి మొకం జూసెరగదు. నువ్వింకనైనా నిమ్మళించాల. దానికోసరం గాకపో యినా, బిడ్డల మొకం జూసైనా కాపరం జేసుకోవాల,'' అని మర్యాదగానే చెప్పి చూసింది.

పరిస్థితి ఏం మారలేదు. రాజమ్మ బతుకు కనా కష్టంగానే ఉంది.

ఒకరోజు దీపాలు పెట్టేవేళ మా కనకత్త పైట కొంగు బిగించి కట్టి చరచరా నటరాజన్ బంకు దగ్గరికి నడిచింది. నడిరోడ్లో నిలుచుని ఊరంతా వినేట్టుగా చెడామడా తిట్టింది.

''రే! నా బట్టా! నీకసలు మంచీ సెబ్బరా వుండాదా? పెద్దా, సిన్నా అంటే మతింపు ఉండాదా? అల్లుడు నా బట్ట గదాని కాళ్లూ, గెడ్డం బట్టుకొని బతిమాలేకొందికీ బిర్ర బిగుసుకున్నావు గదరా! అన్న దమ్ముడు సరే, పెళ్లానికి బయపడి దాన్నట్టా నట్టేట్లో వొదిలేసిపోయినాడు. కన్నతల్లిని నేనుండానురా బొంది లో పేణంతో! వోరే! దానికెవురూ లేరుగదా, కూడూ నీళ్లు లేక అది గుట్టుక్కుమంటే దేన్నో వొకదాన్ని కట్టు కోని ఊరేగొచ్చుగదాని మీ తల్లీబిడ్డలు యోచన జేస్తుం డారేమో! నేను సాగనీనోరే!'' అని చుట్టూ చూసింది.

''మొగుడనే వోడు తీరుగా ఉంటే ఆడముండకి ఈ మాదిరి అగచాట్లు యాడనించి వొస్తాయంట! ఇదిగో, ఈ నడీదిలో మన్నారుసామి ఎదురుగ్గా నిలబడి చెబ్తుండా... నన్ను నోళ్లలో యేసుకున్న నా సవితు లంతా గూడా ఇనాల. ఈ నాబట్టలో తప్పేం లేకుండా ఉంటే నా బిడ్డ ఇట్టాంటి పని జేసునా ఏమి? ఈ చాతగా నోడి దెగ్గిర, ఈ ముండమొకమాడి దెగ్గిర, ఈ ఆడంగి నాబట్ట దెగ్గిర ఇంక నా బిడ్డేం సుకపడతాది?

''ఇదిగో! అందరూ ఇనండి! నా బిడ్డ ఇంక ఒక మొగనాబట్ట కాళ్ల కాడ పడుండబళ్లా. కడంత గాలం సావుదెబ్బలు తింటా బతకబళ్లా. నా బిడ్డన్నేను తీసుక పోతుండా. నా బిడ్డన్నేను కాపాడుకుంటా! కడుపులో బెట్టుకుంటా! బగమంతుడు దానికింత ఆదరువు సూపించకపోడు. రే! దానికీ నీ మాదిరిగానే కాళ్లూ చేతులూ ఉండాయి. దాని కూడది తింటాది. దాని నీళ్లది తాగతాది. మళ్లీ నీ మొత్త తొక్కితే నీ యెడంకాలి చెప్పుతో కొట్టు!'' అని, నాలుగడుగులు ఇవతలికి వేసి, తిరిగి చరచరా బంకు ముందుకి పోయి నిలుచుంది.

''రే... యొరే! నా బిడ్డగాని ఇంక నీ మొకం జూసిందో.. సే! లంజా! అను,'' అని వెనుదిరిగింది. నట రాజన్ ఇంట్లో ఎముకలపోగులా పడి ఉన్న రాజమ్మని పసిబిడ్డలాగా చేతుల్లోకి జవురుకుని ఇంటివైపు నడిచింది.

*

ఇప్పుడు మా ఊరి కోనేటి గట్టున రెండు బంకు లున్నాయి.

నటరాజన్ బంకుకు ఎంత పేరుందో రాజమ్మ బంకుకీ ఊళ్లో అంతపేరుంది.

*'బిడ్డల తల్లి' పేరుతో ఆంధ్రప్రభ వారపత్రిక, 27 మార్చి 1991*

